కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు


ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ దంపతులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బతుకమ్మ ఆటపాట సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు బతుకమ్మలను పేర్చి వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ శాఖల బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక పూజల అనంతరం కలెక్టర్ కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. సంబరాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రథమ, ఉద్యానవన పట్టుపరిశ్రమశాఖ ద్వితీయ, జిల్లా సంక్షేమశాఖకు తృతీయ బహుమతులు లభించగా కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, భూసేకరణ ప్రత్యేకాధికారి డి.చంద్రకళ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ వల.. కానుల కాజేత

- ఆన్‌లైన్ షాపింగ్‌లో అప్రమత్తత అవసరం



☛ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ యువకుడికి ఆన్‌లైన్‌లో ఓ ప్రముఖ కంపెనీ నుంచి చరవాణులపై 40 శాతం ఆఫర్లు ఉన్నాయంటూ సందేశం వచ్చింది. దీంతో ఆ యువకుడు కంపెనీ పంపిన వివరాలకు అనుగుణంగా బ్యాంకు ఖాతా ద్వారా రూ.35 వేలు పంపించాడు. వారం రోజులు గడిచినా తనకు ఎలాంటి పార్సిల్ రాకపోవడంతో సంస్థ చూపిన చరవాణికి నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని తెరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

☛ ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దేగామకు చెందిన ఉదయ్ ఓ చరవాణి ఆర్డర్ చేయగా మంగళవారం మధ్యాహ్నం డెలివరీ బాయ్ వచ్చి అందించాడు. అతడి సమక్షంలో తెరిచి చూడగా రాళ్లు, సబ్బు బిళ్ల వచ్చాయి.



పండగ పూట.. పారాహుషార్

ఉమ్మడి జిల్లాలో సగటున సాధారణ రోజుల్లో సుమారు రూ.25 లక్షల వరకు ఆన్‌లైన్ వ్యాపారం జరుగుతుంది. పండగ వేళ రోజుకు ఇది రూ.50 లక్షల వరకు జరుగుతుంది. ఈ సమయంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, తదితర సామాజిక మాధ్యమాల్లో ఆఫర్ల పేరుతో ప్రకటనలు పంపిస్తారు. చరవాణులు, దుస్తులు, చేతిగడియారాలు, తదితర అలంకరణ వస్తువుల లోగోలను పంపి మార్కెట్ ధర కంటే 30 నుంచి 50 శాతం వరకు తగ్గింపు ధరలకు ఇస్తామంటూ మాయ చేస్తారు. ఆన్‌లైన్‌లో ఉండగానే వస్తువు కొనుగోలు చేయాలని సమయం మించిపోతుందని తొందరపెడతారు. అలాగని మన బ్యాంకు ఖాతా వివరాలు పంపిస్తే డబ్బులు మాయమవుతాయి. మంచిర్యాల జిల్లాలో జనవరి 1 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 122 సైబర్‌క్రైం కేసులు నమోదయ్యాయి.

మంచిర్యాల నేరవిభాగం, చెన్నూరు, న్యూస్‌టుడే: కొద్దిరోజుల్లో బతుకమ్మ, దసరా, దీపావళి పండగలు రానున్నాయి. పండగలంటే నూతన వస్త్రాలు, అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఆఫర్ల పేరుతో వల వేయనున్నారు. ఆకట్టుకునే ప్రకటనలకు ఆశపడితే మొదటికే మోసపోయే ప్రమాదం లేకపోలేదు. అనవసరపు లింక్‌లకు క్లిక్ చేస్తే మనం తెరుకునే లోపే ఖాతాలు ఖాళీ అవుతాయి.

తక్కువ ధరలంటే నమ్మవద్దు

సైబర్ మోసగాళ్లు భారీ ఆఫర్లు ఇస్తామని చెప్పి యాప్‌ల ద్వారా ప్రకటనలు ఇస్తారు. మార్కెట్‌లో రూ.లక్షకుపైగా ఉన్న చరవాణులపై 75 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని ప్రచారం చేస్తారు. వీటిని నమ్మి మోసపోవద్దు. నమ్మకమైన వెబ్‌సైట్‌ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. డెలివరీ సమయంలో వీడియో రికార్డు చేసి ఉంచుకోవాలి.

1930 టోల్‌ఫ్రీ నంబరు

సైబర్‌క్రైం పోలీసుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసేలోపే నేరగాళ్లు డబ్బును ఖాతాల నుంచి లాగేసుకుంటున్నారు. ఖాతా నుంచి డబ్బు పోయినట్లు గుర్తించగానే కేంద్రహోంశాఖ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలి.

నెరవేరిన ఏళ్ల కల!

- నియామకపత్రాలు అందుకున్న డీఎస్సీ అభ్యర్థులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే

ఉపాధ్యాయ కొలువుల అభ్యర్థుల సుదీర్ఘకాల నిరీక్షణకు తెరపడింది. దసరా పండగ తర్వాత బడులకు కొత్త ఉపాధ్యాయులు రాబోతున్నారు. జిల్లాలో 288 పోస్టులతో ప్రభుత్వం డీఎస్సీ 2024 ప్రకటించింది. పరీక్షలు, ఫలితాలు, మెరిట్‌లను విడుదల చేసిన అనంతరం 248 మంది ఉపాధ్యాయుల స్థానాలు ఖరారయ్యాయి. ఆయా కేటగిరీల్లో ఎంపికైన సమాచారం అందుకున్న అభ్యర్థులు బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల మైదానం నుంచి 6 ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్ చేరుకొని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. దసరా అనంతరం వెబ్ ఆప్షన్‌లు అందుబాటులోకి రానున్నట్లు ఆయా సంఘాలు, విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఖాళీలు ఉన్న చోట బడులను ఎంపిక చేసుకునేలా అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు. మరో పక్షం రోజుల్లో ప్రభుత్వ బడుల్లో నూతన ఉపాధ్యాయులు చేరనున్నారు.

కేటగిరీ, మాధ్యమాల వారీగా ఎంపికైన అభ్యర్థుల వివరాలు

ప్రభుత్వ యాజమాన్యంలో..	స్థానికసంస్థల యాజమాన్యంలో..
ఎస్జీటీ–11, ఎల్పీ తెలుగు–1, ఎల్పీ హిందీ–1, ఎస్ఏ జీవ శాస్త్రం–1, ఎస్ఏ భౌతిక–1, ఎస్ఏ సాంఘికశాస్త్రం–1, ఎస్ఏ గణితం–1, ఎస్జీటీ ఉర్దూ–1, ఎస్ఏ హిందీ–1, పీఈటీ–1	ఎస్జీటీ–150, ఎస్జీటీ ఉర్దూ–3, ఎల్పీ ఉర్దూ–1, ఎల్పీ తెలుగు–6, ఎల్పీ హిందీ–4, పీఈటీ ఉర్దూ–1, పీఈటీ తెలుగు–1, ఎస్ఏ తెలుగు–5, ఎస్ఏ హిందీ–5, ఎస్ఏ ఆంగ్లం–5, ఎస్ఏ గణితం–10, ఎస్ఏ జీవశాస్త్రం–13, ఎస్ఏ సాంఘికశాస్త్రం–24



జిల్లాలో 288 పోస్టులతో సర్కారు మెగా డీఎస్సీ-2024 ప్రకటించింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్-70, భాషా పండితులు-16, పీఈటీ-3, ఎస్జీటీలు-176, స్పెషల్ ఎడ్యుకేటర్-23 ఉన్నాయి. ఓసీ-101, ఎస్సీ-48, ఎస్టీ-23, బీసీ ఏ-25, బీసీ బి-20, బీసీ సీ-4, బీసీ డీ-11, బీసీ ఈ-7, వికలాంగులు-17, ఈడబ్ల్యూఎస్-25, మాజీ సైనిక ఉద్యోగులు-7 పోస్టులు భర్తీ చేసేలా పరీక్షలు నిర్వహించింది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ర్యాంకులు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్‌ల ప్రకారం 255 మంది ఎంపికైనట్లు ప్రకటించారు. చివరికి 248 మందికి మాత్రమే నియామక పత్రాలు జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో స్థానిక సంస్థల పాఠశాలల్లో 228 మంది, ప్రభుత్వ పాఠశాలల్లో 20 మందిని ఎంపిక చేశారు. కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎస్జీటీ, ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ 23 పోస్టుల్లో ఒక్కరిని కూడా నియమించలేదు. మిగిలిన 40 పోస్టుల్లో తమకు చోటు దక్కుతుందా, వాటిని ఇదే మెరిట్ జాబితాతో పూర్తి చేస్తారా అనే సందేహాలు పిలుపురాని అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్నాయి.


మంచిర్యాల నుంచి ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు నియామక పత్రాల కోసం బయలుదేరిన అభ్యర్థులు

జూనియర్ న్యాయవాదులు నిరంతరం శ్రమించాలి



మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య

మంచిర్యాల న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాదులు నిత్య విద్యార్థుల్లా న్యాయశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని న్యాయస్థానాల సముదాయంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జూనియర్ న్యాయవాదులు అవగాహన పెంచుకుంటూ వృత్తిలో రాణించాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జిలు అర్పిత మారంరెడ్డి, సంపత్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగయ్య, న్యాయవాదులు మల్లయ్య, సంధాని, రాయమల్లు, రవీందర్, శ్రీనివాస్, రాములు, రమేష్ పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు దసరా కానుక


కార్మికులకు రూ.6,500 చెక్కు అందజేస్తున్న అదనపు పాలనాధికారి మోతీలాల్, పౌరసరఫరాల మేనేజర్ శ్రీకళ

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాల పరిధిలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో పని చేసే హమాలీలకు రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ దసరా కానుకలు ప్రకటించింది. ఒక్కో కార్మికుడికి రూ.6500తోపాటు స్వీట్‌బాక్స్‌లను అందించింది. ఇందులో భాగంగా మంచిర్యాల, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూరు, కోటపల్లి, తాండూరు గోదాముల్లో పని చేసే 44 మంది హమాలీ కార్మికులకు కానుకలు పంపిణీ చేసింది. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు పాలనాధికారి సబావత్ మోతీలాల్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకళ హమాలీలకు ఒక్కొక్కరికి రూ.6500 చెక్కుతోపాటు దసరా కానుకలు అందజేశారు. గ్రేడ్-1 అధికారి మహిపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పంటగా.. గంజాయి..

గంజాయి అనగానే.. అదెక్కడ దొరుకుతుంది. దాని కోసం జిల్లాలు దాటాలి. దొరికితే జైలే అనే పరిస్థితి ఉండేది. ఎక్కడి నుంచో తీసుకురావడం. ఇక్కడ విక్రయించడం సాధారణంగా జరుగుతుంది. ఈ మధ్య కాలంలో పోలీసుల తనిఖీలు, నిఘా అధికమయ్యాయి. దీంతో గంజాయి విక్రయదారులు వారి పంథాను మార్చుకున్నారు. నానా ఇబ్బందులు పడి ఎక్కడి నుంచో తేవడం ఎందుకు? తెచ్చినా విక్రేత చెప్పిన ధరకు కొనుక్కొని రావాలి. ఇదంతా అవసరమా.. అంటూ ఇంటి ఆవరణలో పెంచుకుంటున్నారు. చివరికి పోలీసులకు పట్టుబడుతున్నారు.


నర్సాపూర్‌లో పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు (పాత చిత్రం)

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో 6 నెలల కాలంలో 25 ఎండు గంజాయి కేసులు, మొక్కల పెంపకం కేసులు 4 నమోదయ్యాయి. 55 మంది నిందితులను పట్టుకొని వారి నుంచి 9.447 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది లాభాపేక్షతోపాటు మరికొందరు గంజాయికి బానిసలుగా మారి తమ తమ నివాస ప్రాంతాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నారు. విక్రేతలు, కొనుగోలు చేసే వారి మీద పోలీసులు ప్రత్యేక దృష్టిసారించడంతో సాగుదారుల విషయం బయటకు వస్తోంది.

శునకంతో తనిఖీలు



సబ్ డివిజన్ పరిధిలో గంజాయి రవాణా, తాగడాన్ని అరికట్టేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. మొయినాబాద్‌లో శిక్షణ పొందిన బెల్జియం వెలడాయిస్ జాతికి చెందిన సింబా అనే పేరుగల శునకాన్ని 2021లో బెల్లంపల్లికి తీసుకొచ్చారు. ప్రస్తుతం దాని వయసు 4 సంవత్సరాలు. ఝార్ఖండ్‌లో జరిగిన ఆలిండియా 2024 నార్కోటిక్ పరీక్షల్లో ఈ శునకం 4వ స్థానంలో నిలిచింది. కాళేశ్వరం జోన్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఈ శునకాన్ని ప్రస్తుతం బెల్లంపల్లి పరిధిలో గంజాయి తాగుతున్న అనుమానితుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేసేందుకు ఉపయోగిస్తున్నారు.

గతంలో పక్క జిల్లా నుంచి..

గతంలో మంచిర్యాల జిల్లాకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న తిర్యాణి మండలంలోని పలు అటవీ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తుండేవారు. లేదంటే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి వెళ్లి తీసుకొచ్చి స్థానికంగా విక్రయించడంతోపాటు డబ్బుల ఆశకు కొంత మంది యువకులు హైదరాబాద్‌కు తీసుకెళ్లి కళాశాలల విద్యార్థులకు అమ్మేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయి స్థానికంగా మొక్కలు పెంచుకుంటున్నారు.


ఈ వాహనాల స్థానంలో మొన్నటి వరకు తోపుడు బండ్లు కనిపించేవి..


మరోచోట నిబంధనలతో కూడిన సూచికలు, సంఖ్యలు కేటాయించడంతో ప్రస్తుతం ఇలా కనిపిస్తున్నాయి

ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే..!

మంచిర్యాల మార్కెట్‌రోడ్‌కు ద్విచక్రవాహనంతో వెళ్లాలంటే చుక్కలు కనిపించేవి. ఇక కారు అయితే అంతే సంగతులు. ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సిందే. దారి మధ్యలో పదుల సంఖ్యలో తోపుడు బండ్లు, వాటి వద్ద కొనుగోలు చేసే క్రమంలో ఇరువైపులా నిలిపిన వాహనాలతో ఇబ్బందికర పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ కష్టాలు కాస్త తీరినట్లే కనిపిస్తున్నాయి. పురపాలిక అధికారులు ఇటీవల అక్రమ నిర్మాణాలు తొలగించడంతోపాటు తోపుడు బండ్ల కోసం మరో రోడ్‌లో ఒక్కో దానికి కోసం ఒక్కో సంఖ్య సూచించి స్థలం కేటాయించడంతో బండ్లన్నీ ఆయా చోటకు తరలించారు. దీంతో మార్కెట్‌రోడ్‌లో కొంత మేర ట్రాఫిక్ సమస్య తగ్గింది. ఇక ఏ షాపుకు సంబంధించిన పార్కింగ్ ఆయా యజమానులే ఏర్పాటు చేసుకుంటే పూర్తిగా తొలగిపోయే అవకాశం ఉంది. - **న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ**

ఆర్డీఓ కార్యాలయం ప్రారంభం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్డీఓ కార్యాలయాన్ని బుధవారం పాలనాధికారి కుమార్ దీపక్ చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇంతకుముందు ఆర్అండ్‌బీ కార్యాలయ ఆవరణలోని ఆర్డీఓ కార్యాలయాన్ని తాజాగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మర్చారు. అదనపు పాలనాధికారి మోతీలాల్, ఆర్డీఓ రాములు, ఏసీపీ ప్రకాష్, కలెక్టరేట్ కార్యాలయం ఏఓ పిన్న రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


తెగిన కాలువను పొక్లెయిన్‌తో పూడుస్తున్న ఆయకట్టు రైతులు

చందాలు వేసుకుని.. కాలువకు మరమ్మతులు

భీమిని, న్యూస్‌టుడే: భీమిని మండలం రాంపూర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు సొంత డబ్బులతో కాలువకు మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాంపూర్ ప్రాజెక్టు ఎడమ కాలువ తెగిపోయింది. ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా సాగు నీరు రాక పొలాలు ఎండుతున్నాయి. బిట్టూర్‌పల్లి గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు చందాలు వేసుకుని బుధవారం పొక్లెయిన్‌తో తెగిన కాలువను పూడ్చారు.


మందమర్రి మార్కెట్‌లో ఆటోలో తీసుకొచ్చిన పూలు

మార్కెట్‌లో విక్రయాల సందడి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా వివిధ రకాల పూలు విక్రయాలు కోసం చిరువ్యాపారులు, రైతులు రాగా మందమర్రి మార్కెట్‌లో సందడి నెలకొంది. సాయిబాబా ఆలయం నుంచి మార్కెట్ వరకు పూల విక్రయాలు జరిపేందుకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున వినియోగదారులు తరలిరావడంతో రద్దీ నెలకొంది. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

పత్తి ధర.. కాకూడదు దగా

- ఇప్పుడే చక్రం తిప్పుతున్న వ్యాపారులు


ఈటీవీ – ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 10.15 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 71.05 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని మార్కెటింగ్‌శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.7521గా నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేటులో రూ.7,700 పైచిలుకు ధర పలుకుతోంది. ఒకవేళ ఇదే ధర కొనసాగితే భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు చేస్తుందా? లేదా? అనేది ప్రశ్నార్థకమే. సీసీఐ పోటీ లేకపోతే నాణ్యత, తేమ పేరిట రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఆదిలాబాద్, భైంసా, జైనూర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో సిండికేట్‌గా ఉన్న కొందరు ప్రైవేటు వ్యాపారులు ఇప్పటికే సీసీఐ పాత్రను పరిమితం చేయటం కోసం ప్రయత్నాలు చేస్తున్నందునే కొనుగోళ్ల ముహూర్తం ఖరారు కాలేదని తెలుస్తోంది.


ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు

సీసీఐ పాత్ర ఏమిటి?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీసీఐ రెండు విధాలుగా పత్తి కొనుగోళ్లు చేయడానికి వెసులుబాటుంది. మొదటిది బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే తక్కువ ధరతో వ్యాపారులు కొనుగోళ్లు చేస్తుంటే సీసీఐ రంగంలోకి దిగాలి. ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోళ్లు చేస్తూ రైతులు నష్టపోకుండా చూడాలి. రెండోది ప్రైవేటు వ్యక్తులతో పోటీ పడి కొనుగోళ్లు చేయటం. వ్యాపారులు ఏకమైతే సీసీఐ వల్ల రైతుకు న్యాయం జరుగుతుంది. కానీ ఆ సంస్థ ఇప్పుడు రంగంలో ఉంటుందా? లేదా? అనేది అనుమానాలకు తావిస్తోంది.



నేతలతో సమాలోచన

దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భైంసా వ్యవసాయ మార్కెట్‌యార్డుల పరిధిలోనే అత్యధికంగా పత్తి అమ్మకానికి వస్తోంది. మంచిర్యాల జిల్లాలో చివరిస్థానంలో నిలుస్తోంది. ధర నిర్ణయంలో వ్యాపారుల మాట చెల్లుబాటవుతోంది. ఆదిలాబాద్, భైంసా, ఆసిఫాబాద్‌లో కొంతమంది నేతలతో వ్యాపారులు అంతర్గత సమాలోచనలు చేయటం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఒకవేళ నేతలు ఒత్తిడి చేస్తే ఇప్పటికే కొనుగోళ్ల ముహూర్తం ఖరారయ్యేది. కానీ అలా జరగటం లేదు. పత్తి వ్యాపారంలో చక్రం తిప్పడంలో అనుభవం కలిగిన భైంసాకు చెందిన కొందరు నేతల పాత్ర కీలకంగా ఉన్నట్లు వ్యాపార వర్గాల ద్వారా తెలియవచ్చింది. ఆదిలాబాద్ లాంటి ప్రాంతాల్లో కొనుగోళ్ల ముహూర్తం ఖరారు కాకపోవటం అనుమానాలకు తావిస్తోంది. అఖిలపక్ష నేతలను మినహాయిస్తే ప్రజాప్రతినిధులెవరూ పత్తి కొనుగోళ్లపై ఆసక్తి చూపకపోవటం విమర్శలకు తావిస్తోంది

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని 16వ వార్డు టేకులబస్తీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ గల్లీ అంతా చీకటిమయంగా మారుతుంది. **- ప్రభాకర్, టేకులబస్తీ**

✔ దసరా సందర్భంగా ప్రతి గల్లీలో వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. **- శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్**

? కాంట్రాక్టరుబస్తీలో చెత్తా చెదారంతో కాలనీ అంతా దుర్వాసన వస్తుంది. వ్యర్థ వస్తువుల వ్యాపారం పట్టణం బయట చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. **- శ్రీనివాస్, కాంట్రాక్టరుబస్తీ**

✔ చెత్తా చెదారాన్ని ప్రతిరోజు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం. కాలనీలకు చెత్త బండ్లు పంపిస్తున్నాం. వ్యర్థ వస్తువులు రోడ్డుపై వేస్తే జరిమానాలు భారీగా విధిస్తాం. **- వైకుంఠం, పారిశుద్ధ్య అధికారి**

కడుపు నొప్పితో సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు కోట సతీశ్(36) కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం సతీశ్ రామకృష్ణాపూర్‌లోని ఆర్కే 6 గనిలో పని చేస్తున్నారు. ఆరు నెలలుగా అతడు కడుపు నొప్పితో బాధ పడుతున్నారు. దసరా నేపథ్యంలో స్వగ్రామం రాగా మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు గోదావరిఖని సింగరేణి ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: మంచిర్యాల పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో బుధవారం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ కింద పడి గుర్తుతెలియని వ్యక్తి(55) దుర్మరణం చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు 8712658596, 9701112343లకు సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్‌పై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకెనపల్లికి చెందిన తోకల


ప్రదీప్

ప్రదీప్ (21) మృతి చెందినట్లు రెండో పట్టణ ఎస్సై మహేందర్ తెలిపారు. బెల్లంపల్లి నుంచి ఆకెనపల్లికి వెళ్తుండగా డివైడర్‌కు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గొలుసు దొంగల అరెస్టు

చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణంలోని పద్మశాలి వీధిలో ఇటీవల ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ రవీందర్, ఎస్సై శ్వేత బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. గత నెల 23న పద్మశాలి వీధికి చెందిన రాజుబాయి అనే వృద్ధురాలు సమీపంలోని శివాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాన్ని లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 7న పట్టణంలోని రాజీవ్‌రోడ్డు మార్గంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు తమను చూసి పారిపోవడం గమనించి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటకు వచ్చింది. పట్టణంలోని బట్టిగూడెం కాలనీకి చెందిన నెన్నెల సూర్య, జిట్టబోయిన సంతోశ్‌లు దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన కలప పట్టివేత

జన్నారం, న్యూస్‌టుడే: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని అల్లీనగర్ సెక్షన్‌లోని అదే గ్రామానికి చెందిన ఆత్రం నగేశ్ ఇంట్లో నిలువ ఉంచిన రూ. 54 వేల విలువైన కలపను బుధవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. జన్నారం ఇన్‌ఛార్జి రేంజీ అధికారిణి సుష్మారావుకు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన డిప్యూటీ రేంజీ అధికారి తిరుపతి, సెక్షన్ అధికారులు శివకుమార్, మధుకర్, కిరణ్మయిజ్యోతి, బీట్ అధికారి లాల్‌బాయి కలిసి అల్లీనగర్ వెళ్లి అక్కడ సోదాలు నిర్వహించగా కలప బయట పడింది. పట్టుకున్న కలపను జన్నారంలోని కలప డిపోకు తరలించారు.

రేషన్ బియ్యం..

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : రామకృష్ణాపూర్‌లో అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. వాహన డ్రైవర్ సంతోష్‌తో పాటు బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

జూద స్థావరంపై దాడి


చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణం గెర్రెకాలనీ ప్రాంతంలోని జూద స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న రూ.5,200 నగదు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట గ్రామ శివారులో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.సతీశ్ తెలిపారు. వారి నుంచి రూ.3500 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

నెన్నెల: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని బెల్లంపల్లి సీఐ అఫ్జలోద్దీన్ అన్నారు. మండలంలోని నార్వాయిపేటలో బుధవారం కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.

పడకేసిన పారిశుద్ధ్యం


అస్నాద్ రజకవీధిలో బోరుపంపు వద్ద మురుగు నీరు

న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం: కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, సిబ్బంది పెడచెవిన పెడుతున్నారు. చెన్నూరు మండలంలోని అస్నాద్ గ్రామాన్ని ఇందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. అస్నాద్ పంచాయతీలో పారిశుద్ధ్యం పరిస్థితులు అధ్వానంగా మారాయి. గ్రామంలోని పలు వీధుల్లో మురుగునీళ్లు రోడ్లపై పారుతున్నాయి. గ్రామంలో రజకవీధి, సర్తాపువాడ, ఎస్సీకాలనీ, తోటవాడల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు జ్వరాలు, చికెన్‌గున్యాతో మంచాలు పడుతున్నారు. గ్రామంలోని బెస్తవాడకు చెందిన దుర్గయ్య అనే మహిళ ఇటీవల జ్వరంతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. కాగా రెండు నెలల క్రితం చేపట్టిన బదిలీల్లో అస్నాద్ పంచాయతీ కార్యదర్శి మరో ప్రాంతానికి బదిలీకాగా ఆయన స్థానంలో మరెవరూ రాలేదు. దీంతో సమీపంలో ఉన్న పొన్నారం కార్యదర్శికి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సర్తాపు వీధిలో నిలిచిన మురుగు


ఆర్కే-5 గనిలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు


ఆర్కే-7 గనిలో అమ్మవారిని దర్శించుకుంటున్న జీఎం సంజీవరెడ్డి


బెల్లంపల్లి : పూజలు చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్వేత

ప్రత్యేక పూజలు.. కుంకుమార్చనలు

జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతీ మాత రూపంలో దర్శనమిచ్చారు. ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన దేవీ మూర్తులకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. పలు చోట్ల అన్నదానాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలలో అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌టుడే బృందం


బెల్లంపల్లి : కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతి అవతారంలో అమ్మవారు


ఆర్కేపీలో కుంకుమార్చన మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


చండీయాగంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్


పూజలు చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్


ఆర్కేపీ సీహెచ్‌లో నిర్వహించిన చండీయాగంలో పాల్గొన్న జీఎం దేవేందర్, ఇతర అధికారులు

పట్టుదలతో శ్రమించి.. విజయం సాధించి

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) పరీక్ష ఫలితాల్లో జిల్లావాసులు మెరిశారు. ఆగస్టు 7న పరీక్షలు నిర్వహించగా మంగళవారం ఫలితాలు వెలువడ్డాయి.

రెండు ఉద్యోగాలు సాధించి..


మహేందర్

నస్పూర్: పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధించవచ్చని నిరూపించాడు నస్పూర్‌కు చెందిన నలవల తిరుపతి-తారా దంపతుల కుమారుడు మహేందర్. తండ్రి సింగరేణి కార్మికుడు కావడంతో ఎలాగైన అధికారి కావాలని పట్టుదలతో శ్రమించాడు. పూణేలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సర్కారు కొలువు కోసం ప్రయత్నం చేస్తూ సెప్టెంబరు 17న విడుదలైన పరీక్ష ఫలితాల్లో సింగరేణి మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ(ఎంజీటీ) 26వ ర్యాంకు సాధించాడు. మంగళవారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ 2వ ర్యాంకు సాధించాడు.

సింగరేణిలో ఉద్యోగం..


శశికుమార్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగాన్ని ఒడిసిపట్టేదాకా ప్రయత్నం చేసి సఫలీకృతుడయ్యాడు బెల్లంపల్లి మండలం బూధఖుర్ద్ గ్రామానికి చెందిన సింగతి శశికుమార్. ఆయన 2012 సంవత్సరంలో బీటెక్ పూర్తి చేశారు. తర్వాత జైపూర్ పవర్ ప్లాంట్‌లో ఏడాదిపాటు ఉద్యోగం చేశాడు. ఉద్యోగ నోటిఫికేషన్లు రాకపోవడంతో 2016 సంవత్సరంలో ఐటీఐలో చేరి 2018లో పూర్తి చేశాడు. ఓ కంపెనీలో మరో మూడేళ్లు ఉద్యోగం చేశాడు. కరోనా సమయంలో భవనాల్లో ఎలక్ట్రీషియన్‌గా పనులు సైతం చేశాడు. 2021 సంవత్సరంలో సింగరేణి ఒప్పంద సంస్థ జేఎంఎస్ కంపెనీలో చేరాడు. ఈ సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న సమయంలో సింగరేణిలో ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చింది. గతంలో రెండుసార్లు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చదివిన శశికుమార్ చివరికి సింగరేణి సంస్థలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగం సాధించారు.

అధునాతన పద్ధతులతో సేవలు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఎస్వీసీ సినిమా(లక్ష్మీ టాకీస్) సమీపంలో ఏర్పాటు చేసిన నారాయణ హాస్పిటల్‌ను బుధవారం ఐఎంఏ కార్యదర్శి డా.విశ్వేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డా.కోటేశ్వర్ అతిథులుగా హాజరై ప్రారంభించారు. ప్రయాణ ప్రాంగణం పక్కన కొన్ని సంవత్సరాలుగా సేవలందించి తమ సొంత భవనంలోకి మార్చినట్లు ఆసుపత్రి నిర్వాహకురాలు, జనరల్ లాప్రోస్కోపిక్ సర్జన్, ప్రొక్టాలజిస్టు కళావతి తెలిపారు. అధునాతన పద్ధతులతో సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కాసర్ల యోహాన్, వైద్యులు మల్లేష్, వెంకటేశ్వర్లు, మూర్తి, సల్మాన్‌రాజ్, రాంబాబు, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న విశ్వేశ్వరరావు, చిత్రంలో నిర్వాహకులు యోహాన్, వైద్యురాలు కళావతి

ప్రభుత్వ భూములు కాపాడాలి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ, లావుని పట్టా భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామ శివారులోని అసైన్డ్‌మెంట్ భూమిలో రియల్ ఎస్టేట్ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. భాజపా ఎస్సీ మోర్చ కార్యదర్శి నవీన్, నాయకులు నర్సింగ్, శ్రీనివాస్, దీపారాణి, స్రవంతి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

రామకృష్ణాపూర్: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వివేక్ యువసేన ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. బుధవారం పట్టణంలోని బిజోన్ రాజీవ్‌చౌక్‌లో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే వివేక్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కాన్షీరాం వర్ధంతి

మంచిర్యాల పట్టణం: మంచిర్యాలలో బీఎస్పీ పార్టీ నాయకులు బుధవారం కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ పార్టీ నాయకులు రవీందర్, రాజేంద్రప్రసాద్, కిరణ్, సాగర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

చెన్నూరు: చెన్నూరు పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు బుధవారం అధికారులు, పాలకవర్గ సభ్యులు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఏడాదికి సరిపడా నిత్యావసర సరకులతోపాటు దుస్తులు, చెప్పులు పంపిణీ చేసినట్లు పుర ఛైర్‌పర్సన్ అర్చన గిల్డా, కమిషనర్ గంగాధర్ తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి యశస్వి పథకం కింద ఉపకార వేతనాల మంజూరుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వినోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి 11వ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు మించరాదన్నారు. ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షిప్తం

సమాజహితమే ధ్యేయంగా పనిచేయాలి

దండేపల్లి: విలేకరులు సమాజ శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొట్నాక తిరుపతి పేర్కొన్నారు. దండేపల్లిలో మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు.

ఎల్ఈడీ దీపాల విరాళం

వేమనపల్లి : కేతనపల్లి గ్రామ పంచాయతీకి బుధవారం 50 ఎల్ఈడీ దీపాలను బొడ్డున బాపూజీ విరాళంగా అందజేశారు. ఆయన హైదరాబాదులో నివాసం ఉంటున్నప్పటికీ సొంత గ్రామం కేతనపల్లి కావడంతో ఊరిపై ఉన్న మమకారంతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

అలరించిన సాహితీసమర్చన

చెన్నూరు, న్యూస్‌టుడే : దేవీనవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని చెన్నూరు పట్టణానికి చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.వి.పట్వర్ధన్ నివాస గృహంలో నిర్వహించిన సాహితీ సమర్చన, అష్టావధానం అలరించాయి. వేడుకలను పురస్కరించుకొని కవి సమ్మేళనం, అష్టావధానం నిర్వహించగా వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ధర్నా

మంచిర్యాల పట్టణం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం నస్పూరులోని పాలనాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా అమలు చేస్తామని ప్రకటించి విస్మరించారని ఆరోపించారు. తమ సమస్యలపై పాలనాధికారి కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు.

పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7,521

ఏసీసీ: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7,521గా నిర్ణయించిందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

భోజనాలకు బదులుగా బహుమతులు ఇవ్వండి

శ్రీరాంపూర్ గ్రామీణం: యాజమాన్యం గనుల్లో కార్మికులకు ఏర్పాటు చేస్తున్న భోజనాలకు బదులుగా బహుమతులు ఇవ్వాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'అన్నివర్గాలను వంచించిన కాంగ్రెస్'


లక్సెట్టిపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వెర్రబెల్లి రఘునాథ్‌రావు

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అధికార కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను వంచించిందని భాజపా జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్‌రావు దుయ్యబట్టారు. బుధవారం పట్టణంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నా కనీసం ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్ రావు, పట్టణ ఇన్‌ఛార్జి తిరుపతి పాల్గొన్నారు.

హాజీపూర్: దేశాన్ని అభివృద్ధి చేసే సత్తా భాజపాకు ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం వేంపల్లిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సభ్యత్వ రశీదులను అందించారు. భాజపా మండల అధ్యక్షుడు స్వామిరెడ్డి, మోటపలుకుల తిరుపతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు..

జిల్లాకు చెందిన అభ్యర్థులు ఏళ్లపాటు శ్రమించి ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామకపత్రాలు అందుకున్నారు.

మూడు ఉద్యోగాలు సాధించి



భర్త రాజు, కుమారులతో శ్రావిక

కాసిపేట: ఓ వైపు కుటుంబాన్ని చూసుకుంటూ మరోవైపు ఉద్యోగానికి సన్నద్ధమై ఏకంగా మూడు ఉపాధ్యాయ కొలువులు సాధించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన రాజు హనుమకొండకు చెందిన శ్రావికను పదేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. శ్రావిక చదువులో రాణించడాన్ని గమనించిన రాజు ఆమెను బీఈడీ, పీజీ చేయించారు. గురుకులంలో 2023లో ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇంటి వద్దే పరీక్షలను సిద్ధమై పీజీటీ, టీజీటీ ఇంగ్లీష్‌లో రెండు కొలువులు సాధించారు. టీజీటీ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా కాగజ్‌నగర్‌లోని జ్యోతిబాపులే గురుకులంలో చేరి విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తుండగా మళ్లీ డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. మంగళవారం విడుదలైన డీఎస్సీ తుది ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ కొలువు సాధించారు. బుధవారం ఉద్యోగ నియామకపత్రాన్ని అందుకున్నారు.

వ్యవసాయం చేస్తూ..

భీమిని: మండలంలోని వీగాం గ్రామానికి చెందిన సంగర్సు భరత్ కుమార్ స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రంలో జిల్లా మొదటి ర్యాంకు, వెంకటాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు గౌరయ్య సాంఘిక శాస్త్రంలో జిల్లాలో అయిదో ర్యాంకు సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జగ్గయ్యపేట గ్రామానికి చెందిన చెట్ల శ్రీప్రియ ఎస్జీటీలో జిల్లా 228 ర్యాంకు సాధించి ఉద్యోగం సంపాదించారు. సంగర్సు భరత్ కుమార్ గురుకుల టీజీటీ, గ్రూప్-4, స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్రం మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గౌరయ్య ఇంటి వద్ద ఒక పక్క వ్యవసాయం చేస్తూ డీఎస్సీకి సన్నద్ధమై సత్తా చాటారు.

జాడ లేని మదర్ ప్రతిభా ఫౌండేషన్ నిర్వాహకులు

నెన్నెల, న్యూస్‌టుడే: : కుట్టు మిషన్లు రాయితీపై ఇస్తానని నమ్మించి మోసం చేసిన మదర్ ప్రతిభా ఫౌండేషన్ నిర్వాహకులు సాంబశివరావు పత్తా లేరని బాధితులు ఆరోపించారు. మండలంలో మూడు నెలల కిందట జెండా వెంకటాపూర్ గ్రామంలో 40 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి రాయితీపై కుట్టు మిషన్లు సైతం అందించారు. జెండా వెంకటాపూర్‌ను చూపిస్తూ వివిధ గ్రామాల్లో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. కుశ్నపల్లిలో 40 మందికి శిక్షణ ప్రారంభించి 15 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం రూ.4,200 చెల్లిస్తే రూ.15,000 మిషన్ అందిస్తామని చెప్పి 40 మంది నుంచి రూ1,68,000 వసూలు చేశారు. మిషన్లు ఇస్తున్నట్లు నమ్మించడానికి 40 మందిలో అయిదుగురు మహిళలకు మండల కేంద్రంలో కుట్టు మిషన్లు అందించారు. మిగతా 35 మంది చరవాణిలో సంప్రదిస్తే స్పందించడం లేదు. ఈ విషయంపై బాధితులు వారం రోజులకిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు.


అమెరికాలో బతుకమ్మ ఆడుతున్న మంచిర్యాల జిల్లా మహిళలు

ఆకట్టుకున్న బతుకమ్మ సంబరాలు

జన్నారం, మంచిర్యాల గ్రామీణం, మందమర్రి పట్టణం, చెన్నూరు, న్యూస్‌టుడే : జిల్లాకు చెందిన కొందరు ఆడపడుచులు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ నగరంలో బుధవారం బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో లయన్స్‌క్లబ్ ఆఫ్ మంచిర్యాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా కొనసాగాయి. లక్కీడ్రా ద్వారా 15 బతుకమ్మలకు ఎంపిక చేసి రూ.20 వేల విలువైన బహుమతులను అందజేశారు. మందమర్రి మండలం ఆదిల్‌పేటలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. చెన్నూరు పట్టణంలో గురువారం జరగనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పుర కమిషనర్ గంగాధర్ తెలిపారు.


ఆదిల్‌పేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


దండేపల్లి అటవీ శివారులో తంగేడు పూలు కోస్తున్న యువకులు

యువత.. తంగేడు పూల బాట

ఈ సారి తంగేడు పూలకు కొరత ఉంది. భారీ వర్షాలకు పూత రాలిపోయి పువ్వు పూయలేదు. గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో తంగేడు పూల కోసం బుధవారం యువకులు, మహిళలు ఉదయం నుంచే వేట ప్రారంభించారు. చెరువు, కాలువ గట్లు, అటవీ ప్రాంతం దగ్గరలో ఎక్కడ చూసిన తంగేడు కోస్తూ కనిపించారు. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

గల్ఫ్ భరోసా.. విస్తరిస్తే బాగు



నిర్మల్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే దాదాపు 70 వేల మంది గల్ఫ్ దేశాలకు వెళ్లగా తాజాగా కొత్తతరం కూడా ఎడారి దేశాల బాట పడుతోంది. సాంకేతిక పరిజ్ఞానం లేని వారే ఆయా దేశాలకు వెళ్తుండటంతో వారంతా భవన నిర్మాణం, వ్యవసాయం వంటి పనుల్లో కుదురుతున్నారు. అక్కడి వాతావరణం, ఆహారం, తదితర పరిస్థితుల కారణంగా అనారోగ్యం, ఆపై మృత్యువాత పడుతున్న వారు కొందరైతే.. క్షణికావేశాలతో చేసే నేరాలతో జైళ్ల పాలవుతున్న వారు మరికొందరు. ఉమ్మడి జిల్లాలో ఏటా 30 నుంచి 40 మంది వరకు గుండెపోటు, మానసిక ఒత్తిడితో అనారోగ్యం కారణంగా చనిపోతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గల్ఫ్ దేశాల్లో ఏ కారణంతో చనిపోయినా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. దీన్ని 7 డిసెంబరు 2023 నుంచి అమలు చేయాలని జీవో జారీ చేసింది. పరిహారం చెల్లించడానికి రూ.10.60 కోట్లు విడుదల చేసింది.

● రూ.5 లక్షల పరిహారంపై బాధిత కుటుంబాల వేడుకోలు..

మిగతా దేశాల్లో పనిచేసే కార్మికులకు వర్తింపజేయాలి

కేంద్రం ఇమిగ్రేషన్ యాక్టు-1983ను రూపొందించింది. ప్రస్తుతం రూ.5 లక్షల పరిహారం బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్‌లో మరణించిన వారికి వర్తింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మిగతా దేశాల్లోని కార్మికులకూ అమలు చేయాలని బాధిత కుటుంబాల సభ్యులు కోరుతున్నారు. అఫ్గనిస్తాన్, జోర్డాన్, లెబనాన్, లిబియా, మలేసియా, సుడాన్, సౌత్ సుడాన్, సిరియా, యెమెన్, ఇండోనేషియా, థాయిలాండ్, సింగపూర్, ఇజ్రాయిల్, కాంబోడియా, రష్యా, ఉక్రెయిన్, మల్దీవులు, తదితర దేశాల్లో ఉన్న వారికి కూడా వర్తింప చేయాలని విన్నవిస్తున్నారు. మరణించిన సమయంలో గల్ఫ్ దేశాల్లో ఉద్యోగానికి సంబంధించి రుజువైన వర్క్ వీసా, ఉద్యోగ ఒప్పందం వంటి ఆధారాలు సమర్పించాలనే నిబంధనతో చాలామంది ఆందోళనలో ఉన్నారు. ఆ దేశాల్లో యజమానులు పెట్టే బాధలు భరించలేక పారిపోయిన వారు కొందరు ఉండగా.. శాశ్వత ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించిన ఏజెంట్లు సందర్శక (విజిట్) వీసాపై గల్ఫ్ దేశాలకు పంపించడంతో అక్కడ పనిలేక అక్రమ నివాసులుగా ఉన్నారు. వీరిందరికీ ఈ పరిహారం వర్తించకపోవడంతో వందల సంఖ్యలో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు.

ఇతర దేశాలకు వర్తింప చేయాలి :

స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసిమిత్ర కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు



గల్ఫ్‌తోపాటు ఇతర దేశాల్లో పనిచేసే కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వర్తింప చేయాలి. సందర్శక వీసాపై వెళ్లి అక్కడ అక్రమంగా నివసిస్తూ మరణించిన బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి సభ్యుల నియామకంలో విదేశాల్లో, స్వదేశంలో ఉన్న వారికి ప్రాతినిధ్యం కల్పించాలి. నకిలీ ఏజెంట్ల మోసాలను అరికట్టాలి. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న వారితోపాటు ఇక్కడున్న వారి కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలి.

గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఉమ్మడి జిల్లా వలస కార్మికులు :	సుమారు 70 వేలు
వలస కార్మికుల కుటుంబ సభ్యులు :	2.50 లక్షలు
ఉమ్మడి జిల్లాలో 7 డిసెంబరు 2023 నుంచి ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి సంఖ్య :	32

ఇవీ నిబంధనలు.. అర్హత ప్రమాణాలు

- గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్‌లో మరణించిన వారికి వర్తింపు
- మరణించిన గల్ఫ్ బాధితుడి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ప్రాధాన్యక్రమంగా చూసి పరిహారం అందజేస్తారు
- గల్ఫ్ కార్మికుడి మరణ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు, ఉద్యోగం రుజువులు (వర్క్ వీసా, ఉద్యోగ ఒప్పందం) ధ్రువపత్రాలు సమర్పించాలి.
- గల్ఫ్‌లో మరణించిన కార్మికుడి కుటుంబ సభ్యులు పరిహారం కోసం కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలి. అర్హులైన దరఖాస్తుదారుల చెల్లుబాటు అయ్యే బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాలి.
- గల్ఫ్‌లో కార్మికుడి మరణం ధ్రువీకరించిన తర్వాత కలెక్టర్ అర్హత గల కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లింపునకు ప్రొసిడింగ్ జారీ చేస్తారు.
- మృతి చెందిన తేదీ లేదా మృతదేహాన్ని స్వీకరించిన తేదీ నుంచి ఆరు నెలల లోపు కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలి
- మంజూరైన రూ. 5 లక్షలు అర్హత ఉన్న కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాకు నేరుగా బదిలీ చేస్తారు.



చంద్రపూర్‌లో సరిహద్దు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన ఐజీ దిలీప్ పాటిల్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి

● కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో మహారాష్ట్ర ఐజీ దిలీప్


బల్లార్ష, న్యూస్‌టుడే: త్వరలో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సరిహద్దున ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పోలీసు అధికారులు సహకరించాలని నాగపూర్ ఐజీ దిలీప్ పాటిల్ అన్నారు. సరిహద్దు జిల్లాలైన కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో చంద్రపూర్‌లోని రేంజర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర-తెలంగాణ రాష్ట్రాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తోడ్పాటు అందించాలన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, యావత్మాల్, గడ్చిరోలి జిల్లాలకు సరిహద్దున కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాలు ఉన్నాయని, ఈ సరిహద్దున ఆరు చెక్‌పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఇవి కాకుండా ఇతర మార్గాల ద్వారా మద్యం, డబ్బు అక్రమంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వీటిని నిరోధించేందుకు రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని పేర్కొన్నారు. సరిహద్దు జిల్లాల అటవీ, రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలు అవసరమైతే వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ బ్రాంచి ఎస్పీ శ్రీనివాస్ పోతారం, కుమురంభీం జిల్లా అడిషినల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, గడ్చిరోలి స్పెషల్ బ్రాంచి ఎస్పీ విశాల్ నాగర్‌గోజే, యావత్మాల్ ఎస్పీ పంకజ్ ఆసియా, చంద్రపూర్ కలెక్టర్ వినయ్‌గౌడ, ఎస్పీ సుదర్శన్ ముమ్ముక్కా తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు చివరి తేదీ 15

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 15న చివరి తేదీ అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సుధాకర్, సమన్వయకర్త గంగాధర్ తెలిపారు. ఇంటర్ తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా 73829 29703 నంబరులో సంప్రదించాలన్నారు.

ఒకరితో ఒకరు పోటీపడి.. కొలువు కొట్టి!

● ఆ కుటుంబాల నుంచి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు..



కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్యం పెట్టుకుని ఇష్టంతో చదివితే విజయం సొంతమవుతుందని యువత నిరూపిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు పోటీపడి మరీ చదివి ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. ఎంపికైన వారు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.

టీచర్ల కుటుంబం..



సోదరులు మహమ్మద్ హుజైఫా, మహమ్మద్ హమ్జా

కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు దానీష్ అహ్మద్‌కు ఇద్దరు కుమారులు. మహమ్మద్ హుజైఫా ఎస్జీటీగా, మహమ్మద్ హమ్జా తెలుగు పండిత్‌గా కొలువులు సాధించారు. 1-10వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొన్నారు. తండ్రిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగాలు సాధించినట్లు సోదరులిద్దరూ చెబుతున్నారు. వీరి పెద్దనాన్న మన్సూర్ అహమ్మద్ విశ్రాంత స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు కాగా ఇద్దరు బాబాయ్‌లు అనీష్ అహ్మద్, రయీస్ అహ్మద్‌లు సైతం స్కూల్‌అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

నాడు అక్క.. నేడు ఇద్దరు చెల్లెలు



అక్కాచెల్లెలు సౌమ్య, కావ్య

కాగజ్‌నగర్ పట్టణం ద్వారకానగర్‌కు చెందిన వ్యవసాయ దంపతులు గోలెం కళావతి-శ్రీనివాస్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు. పెద్ద కుమార్తె సౌందర్య 2012 డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించారు. మిగతా ఇద్దరు కుమార్తెలు సౌమ్య, కావ్య.. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ ముగ్గురు కూడా స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 1-10 తరగతి వరకు చదువుకున్నారు. ఒకే కుటుంబం నుంచి ముచ్చటగా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉపాధ్యాయులుగా కొలువులు సాధించారు. అక్కను స్ఫూర్తిగా తీసుకొని లక్ష్యంతో చదివినట్లు వారు తెలిపారు.

పాతికేళ్లలోపే కొలువు పట్టేశారు!



తల్లిదండ్రులతో అభిషేక్, అభిలాష్

ఒకే ఇంటి నుంచి ఇద్దరు సోదరులు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్ కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ శ్రీరాములు-పద్మ దంపతుల కుమారులు నర్సర్వార్ అభిషేక్-అభిలాష్‌లు. వీరి అక్క బావ మౌనిక-నరేష్‌లు సైతం ఉపాధ్యాయులే. అభిషేక్ 13వ ర్యాంకుతో ఓపెన్ కేటగిరిలో, అభిలాష్ 72వ ర్యాంకుతో రిజర్వేషన్ కేటగిరిలో ఉద్యోగాలు సాధించారు. - న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం

బాసరకు ఆధ్యాత్మిక శోభ





సామూహిక అక్షరాభ్యాసం



గోదావరిలో సూర్యనమస్కారం చేస్తున్న యువతి

కమలం పువ్వుతో భక్తురాలు



అక్షరాభ్యాసం అనంతరం పలక, బలపంతో చిన్నారి



ప్రత్యేక అలంకరణలో జ్ఞానసరస్వతి అమ్మవారు

● ఘనంగా మూలా నక్షత్ర వేడుకలు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: మూలా నక్షత్ర శుభ సమయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారి చెంత అక్షర శ్రీకారానికి వచ్చిన చిన్నారులతో బాసర ఆలయం, అక్షరాభ్యాస మండపాలు కళకళలాడాయి. ఆలయంలో వేద మంత్రాలు, గోదావరిలో పుణ్యస్నానాలు, భక్తుల మొక్కులతో బుధవారం ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. వేకువ జామున 2 గంటలకు మూలా నక్షత్ర పూజ చేసి అక్షరాభ్యాసాలు మొదలు పెట్టారు. ఉదయం భక్తుల రద్దీ నెలకొన్నా మధ్యాహ్నానికి తగ్గింది. అమ్మవారి దర్శనం, పూజలు, అక్షరాభ్యాసాలకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటుచేశారు. పుణ్యస్నానాలు, కుంకుమార్చనలు, గంగమ్మ ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలతో గోదావరి తీరం పులకించింది. సప్తమి ఘడియల్లో సరస్వతి అమ్మవారు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూట అమ్మవారికి రాజోపచార, చతుషష్టి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మహామంగళహారతి పూజలు శాస్త్రోక్తంగా చేశారు. సుమారు 30 వేలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో ఉన్న చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందజేశారు. పిల్లలకు పాలు పట్టేందుకు బాలింతలకు ఫీడింగ్ గదులు ఏర్పాటు చేశారు. 200 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. గతేడాదితో పోలిస్తే భక్తుల తాకిడి తగ్గింది. వీఐపీ పాసులను నిలిపివేయడంతో హడావుడి లేకుండా క్యూలైన్ ముందుకు సాగింది. భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లను తీసుకున్న వారికి ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయంలోని మహాకాళి దర్శనం కోసం వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటుచేయడంతో భక్తులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది.



బందోబస్తు పర్యవేక్షిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

సరస్వతి అమ్మవారిని ఎంపీ నగేష్, ముథోల్, సిర్పూర్(టి) ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, భారాస నాయకురాలు రమాదేవి, తెలంగాణ సినీ నటుడు రోషం బాలు, ఆయా పార్టీల నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చెందిన అతిథి గృహాలు అధికారులు, వీఐపీలకు కేటాయించడంతో సాధారణ భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత సంవత్సరం ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా చాలా మంది భక్తులు బాసరకు రాలేదు. ఆలయ పక్షాన వసతి గదులు అందుబాటులో లేనందున ప్రైవేట్ లాడ్జిల నిర్వాహకులు ఇష్టం వచ్చిన ధరలు వసూలు చేశారు.



దర్శనానికి వస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్, తదితరులు

తగ్గిన అక్షరాభ్యాసాలు

గతేడాదితో పోలిస్తే భక్తుల రద్దీతో పాటు అక్షరాభ్యాసాలు కూడా తగ్గాయి. రూ.1000 ప్రత్యేక అక్షరాభ్యాసాలు 1621, రూ.150 అక్షరాభ్యాసాలు 609 నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 200 మంది చిన్నారులు అక్షరాభ్యాసాల టికెట్లు కొనుగోలు చేశారని ఆలయ ఈవో విజయరామారావు చెప్పారు. అక్షరాభ్యాసాలకు 2-4 గంటల సమయం పట్టింది. ఆలయానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది 2739 అక్షరాభ్యాసాలు జరిగాయి. రూ.35 లక్షల ఆదాయం సమకూరింది.

వరి పొలంలో పులి కళేబరం



బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సావిలీ అటవీ రేంజి పరిధి డోంగర్‌గావ్ గ్రామ పరిసరాలలోని వరి పొలంలో బుధవారం పులి కళేబరాన్ని రైతులు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారమివ్వగా. . వారు కళేబరాన్ని చంద్రపూర్‌కు తరలించారు. చనిపోయింది ఆడ పులి అని, ఏడాదిన్నరేళ్ల వయసు ఉంటుందని పరీక్షల తర్వాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని సావిలీ అటవీ క్షేత్ర అధికారి వినోద్ దుర్వే తెలిపారు.

పంట నష్టపరిహారం మంజూరు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరుసగా కురిసిన వర్షాలతో వాగులతో పాటు సరిహద్దులో ఉన్న పెన్‌గంగ ఉద్ధృతి కారణంగా పలు గ్రామాల్లో పంటలు నీట మునిగి రైతులు పంటలను నష్టపోయారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామాల వారీగా సర్వే చేసి ప్రతిపాదనలు పంపించారు. ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం అందించనున్నారు.

జిల్లా	ఎకరాలు	రైతులు	పరిహారం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	3096	2041	3.09
కుమురం భీం	2692	1371	2.69
మంచిర్యాల	598	447	0.59

విధులకు వెళుతుంటే విధి వంచించింది

● జాతీయ రహదారిపై చెట్టును ఢీకొన్న కారు
● తండ్రి, కుమారుడి దుర్మరణం.. తీవ్రంగా గాయపడ్డ తల్లీకుమార్తెలు



సంగం సురేశ్



సాయివర్షిక్

లోకేశ్వరం/నర్సాపూర్(జి): న్యూస్‌టుడే: తెల్లవారుజామున లేచి విధులకు హాజరుకావాలన్న ఆలోచనతో హడావుడిగా భార్యాపిల్లలతో కారులో బయలుదేరిన విద్యుత్తు ఉద్యోగి కుటుంబాన్ని విధి వంచించింది. కారు ముందు టైరు పగిలి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ చెట్టును ఢీకొట్టిన ఘటనలో తండ్రి, కుమారుడు దుర్మరణం పాలవగా తల్లి, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. నిర్మల్-భైంసా జాతీయ రహదారిలో నందన్ సమీపంలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నర్సాపూర్(జి) ఎస్సై హన్మాండ్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం మన్మద్ వాసి సంగం సురేశ్(28) మన్మద్ విద్యుత్తు ఉపకేంద్రంలో ఆపరేటరుగా పనిచేస్తున్నారు. మంగళవారం భార్య ప్రియాంక, కుమారుడు సాయి వర్షిక్, కూతురు తనిష్కలతో కలిసి అత్తగారి ఊరైన బోథ్ మండలం కుచులాపూర్ వెళ్లారు. రాత్రికి అక్కడే ఉన్నారు. బుధవారం విధులకు హాజరయ్యేందుకు ఉదయమే భార్యాపిల్లలతో తన సొంత కారులో మన్మద్ బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో నర్సాపూర్(జి) మండలం నందన్ దాటగానే కారు ముందు టైరు పగిలింది. అతివేగం కారణంగా అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టును బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ కుమారుడు సాయివర్షిక్(6) అక్కడికక్కడే మరణించగా తీవ్రంగా గాయపడ్డ సురేశ్, భార్య ప్రియాంక, కూతురు తనిష్కలను స్థానికులు అంబులెన్సులో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలోనే సురేశ్ మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్ర గాయాల పాలైన ప్రియాంకకు ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. తనిష్క నిర్మల్‌లో చికిత్స పొందుతోంది. సురేశ్ అత్త మచ్చెర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.



నిర్మల్-భైంసా జాతీయ రహదారిలో నందన్ సమీపంలో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టిన కారు

మన్మద్‌లో విషాదఛాయలు..

అందరితో కలుపుగోలుగా ఉండే సురేశ్‌తోపాటు చిరునవ్వులు చిందించే సాయివర్షిక్‌లు మృతి విషయం తెలియగానే మన్మద్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్థులు ప్రమాద తీరును చూసి చలించారు.

పట్టగొలుసు మింగిన చిన్నారి.. తప్పిన ప్రాణాపాయం



ప్రాణాపాయం తప్పిన చిన్నారి ధ్రుతి



ఏడు నెలల చిన్నారి గొంతులో ఇరుక్కున్న వెండి పట్టగొలుసు

ఆదిలాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే : ఏడు నెలల చిన్నారి పట్టగొలుసు మింగటంతో గొంతులో ఇరుక్కొని ప్రాణాపాయంగా మారగా ఆదిలాబాద్ రిమ్స్ వైద్యులు చాకచక్యంగా బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. గుడిహత్నూర్‌కు చెందిన ధ్రుతి(7 నెలలు) కాలికి ఉన్న వెండి పట్టగొలుసును నోట్లో పెట్టుకోవడంతో బుధవారం గొంతులో ఇరుక్కుపోయింది. కుటుంబ సభ్యులు పాపను రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేసే మామిడి హేమంతరావు(ఈఎన్‌టీ) చాకచక్యంగా ఎండోస్కోపి చేసి గొంతులో ఇరుక్కున్న పట్టగొలుసును బయటకు తీశారు. రిమ్స్ సంచాలకుడు జైసింగ్ రాథోడ్ వైద్యుడు హేమంతరావును అభినందించారు.